

నేడు విద్యా సంస్థలకు సెలవు

కలెక్టరేట్/నరసన్నపేట, సెప్టెంబరు 1: తుఫాన్ కారణంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సోమవారం సెలవును ప్రకటిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుమల చైతన్య ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం తుఫాన్ తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు.



హరిపురం: కుంబిగాం వద్ద సునాముదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

అంతటా హై అలర్ట్

- తుఫాన్‌తో జిల్లాలో మోస్తరు వర్షాలు
- నేడు భారీ వర్షాలు కురిసే అవకాశం
- పోలాకి, జలుమూరులో నీటమునిగిన 282 ఎకరాల వరి
- తీరప్రాంతాల్లో పర్యటించిన అధికారుల బృందం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

తుఫాన్ కారణంగా జిల్లాలో సోమవారం భారీవర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం అంతటా హైఅలెర్ట్ ప్రకటించింది. శనివారం తుఫాన్ తీరందాటడంతో జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షలు కురిశాయి. జిల్లాపై తుఫాన్ ప్రభావం పెద్దగా లేకపోయినప్పటికీ యంత్రాంగం మాత్రం అప్రమత్తంగానే ఉంది. ఒడిశాలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా వంశధార, నాగావళి నదుల్లో స్వల్పంగా నీటి ప్రవాహం పెరిగింది. ఇచ్ఛాపురం వద్ద బహుదా నది ఉగ్రరూపం దాల్చింది. నరసన్నపేట నియోజకవర్గం పోలాకి, జలుమూరు మండలాల్లో వంశధార కుడి ప్రధాన కాలువ పరిధిలో 282 ఎకరాల్లో వరి పైరు ముంపునకు గురైంది. దీంతో కాలువలో నీటి ఉధృతిని తగ్గించారు. మరో మూడురోజుల్లో వరి పైరు సాధారణ స్థితికి చేరుకుంటుందని వ్యవసాయ అధికారులు వెల్లడించారు. ఆదివారం జిల్లాలో 24 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 25 రోజుల తర్వాత గత నాలుగు రోజుల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి పర్యటించారు. అలాగే నదీ తీర ప్రాంతాలను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లనీయకుండా హెచ్చరించారు. ముందు జాగ్రత్తగా సోమవారం జిల్లాలో అన్ని ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

వేటకు వెళ్లొద్దు: ఎస్పీ

గార: తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం బందరువానిపేట గ్రామంలో ఎన్‌డీపీ బృందంతో కలిసి పర్యటించారు. మత్స్యకారులతో మాట్లాడుతూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సముద్రంలో అలలు ఎక్కువగా ఉన్నప్పుడు అటు వైపుగా వెళ్లవద్దని, అధికారులు చెప్పేనంత వరకూ వేట చేయవద్దని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎటువంటి ఇబ్బంది వచ్చినా వెంటనే అధికారులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ వివేకానంద, సీఐ పైడపునాయుడు, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, ఇతర అదికారులు ఉన్నారు. అలాగే తుఫాన్ స్పెషల్ ఆఫీసర్ శాంతిశ్రీ కూడా కళింగపట్నం, బందరువానిపేట పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.



బందరువానిపేట తీరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

సంకుజోడి ఫీడర్ ఛానల్‌కు గండి..

హరిపురం: వర్షాలకు సంకుజోడి, సునాముది ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. కుంబిగాం వద్ద సునాముదిలో నీటి ఉధృతి ఎక్కువగా ఉంది. అలాగే, వరద ప్రవాహానికి సంకుజోడి ఫీడర్ ఛానల్‌కు గండి పడింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



పడవపై పూడిలంక గ్రామానికి వెళ్తున్న అధికారుల బృందం

బాహుదాకు జలకళ..

ఇచ్ఛాపురం: జిల్లాతో పాటు ఒడిశాలో కురుస్తున్న భారీ వర్షాలకు బాహుదా నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. మొన్నటి వరకూ నీరు లేక ఎడారిలా ఉన్న బాహుదా ప్రస్తుతం నీటితో కళకళలాడుతోంది. నదికి నీరు చేరటంతో ఇక తమకు తాగునీటి కష్టాలు తప్పనున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నదిలో నీరు లేకపోవడంతో అధికారులు రోజు విడిచి రోజు కొళాయిల ద్వారా తాగునీరు అందించేవారు. ఇప్పుడు ప్రతిరోజూ తాగునీటిని సరఫరా చేయనున్నారు.



హరిపురం: సంకుజోడి కాలువకు గండి పడిన దృశ్యం

పూండిలంకను చుట్టుముట్టిన ఉప్పుటేరు నీరు..

వజ్రపుకొత్తూరు: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వజ్రపుకొత్తూరు పూండిలంక గ్రామం చుట్టూ ఉప్పుటేరు నీరు చేరింది. దీంతో నడకదారి కొట్టుకుపోవడంతో పూడిలంకవాసులు అత్యవసర సమయాల్లో పడవపైనే రాకపోకలు సాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న మండల ప్రత్యేకాధికారి బి.ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ పి.బాల, ఎంపీడీవో ఈశ్వరమ్మ, డీటీ వి.గిరిరాజు, ఈవోపీఆర్డీ తిరుమలరావు, ఆర్ఐ పవిత్ర పూడిలంక గ్రామానికి పయమయ్యారు, అయితే, గ్రామానికి వెళ్లేందుకు ఎలాంటి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పడవపైనే గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్థులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. తామంతా ఉన్నామని ఆందోళన చెందవద్దని తెలిపారు. ఏ సమస్య వచ్చినా తమకు సమాచారం అందించాలని కోరారు.



బాహుదాలో వరద ప్రవాహం



నారాయణపురం ఆనకట్ట వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్: తుఫాన్ కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లా అధికారులు, మండల నోడల్ అధికారులు, ఆర్డీవోలతో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలను దృష్టిలో పెట్టుకుని ఆయా శాఖలు తీసుకుంటున్న ముందస్తు చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. నదులు, చెరువుల్లోని నీటిమట్టాలపై ఆరా తీశారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైతే తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని సూచించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటి పారుదల, వైద్య ఆరోగ్య, విద్యుత్తు, వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య, ఉద్యానవన, గృహనిర్మాణ శాఖల సన్నద్ధతపై ఆరా తీశారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టం చేశారు. భారీ వర్షాల అనంతరం పర్యవసానాలపై వైద్యారోగ్యశాఖ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను చైతన్యపరచాలన్నారు. అవసరమైన చోట వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్ సిబ్బంది ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

నారాయణపురం ఆనకట్ట పరిశీలన..

బూర్జ: మండలంలోని నారాయణపురం ఆనకట్టను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం పరిశీలించారు. ఆనకట్ట పరిధిలోని రైతులతో మాట్లాడారు. షట్టర్లు పాడయ్యాయని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న గుర్రపుడెక్కను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక అధికారులను లేదా హెల్ప్‌లైన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. నదీతీర గ్రామాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు కురిసి నదిలో నీటిమట్టం పెరిగితే ముంపు ప్రాంతాలపై దృష్టిపెట్టాలన్నారు. అత్యవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. అనంతరం ఉప్పినివలసలో పారిశుధ్య పనులను పరిశీలించారు. తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, డీటీ సంతోష్ కుమార్, ఆర్ఐ, ఇరిగేషన్ ఏఈ బుజ్జి, రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలకు పూర్వ వైభవం

- త్వరలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తాం
- మంత్రి అచ్చెన్నాయుడు
- చిన్నసాన ఎత్తిపోతల పునఃప్రారంభం



చిన్నసాన ఎత్తిపోతల పథకాన్ని పునఃప్రారంభిస్తున్న అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం (ఆంధ్రజ్యోతి)/కోటబొమ్మాళి, సెప్టెంబరు 1: ఎత్తిపోతల పథకాలకు పూర్వవైభం తీసుకువస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. కోటబొమ్మాళి మండలం చిన్నసాన ఎత్తిపోతల పథకాన్ని ఆదివారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2,200 ఎకరాలకు సాగునీరు అందించే ఈ పథకాన్ని 2018లో రూ.25కోట్లతో ప్రారంభించామని చెప్పారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. మోటార్లు చోరీకి గురైనా పట్టించుకోలేదన్నారు. దీనివల్ల సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టేందుకు రూ.80 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. చాన్నాళ్ల నుంచి మూలకు చేరిన చినసాన ఎత్తిపోతల పథకాన్ని మరలా వినియోగంలోకి తీసుకురాగలిగామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. గత ఐదేళ్లలో ఎత్తిపోతల పథకాలను మూలకు చేర్చేసిందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా మూతపడిన ఎత్తిపోతల పథకాలను పునఃప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పునఃప్రారంభాల ట్రెండ్ నడుస్తోందని అన్నారు. మరికొద్దిరోజుల్లో ఎత్తిపోతల పథకాలకు సాగునీటి సంఘాల ఎన్నికలను నిర్వహిస్తామన్నారు. అలాగే వాటిని ప్రైవేటీకరణ చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. పూర్తిస్థాయిలో సాగునీటిని అందించేందుకు సమగ్రచర్యలు తీసుకుంటున్నామన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, వారికి ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే క్షణాల వ్యవధిలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, టీడీపీ నాయకులు, తెలుగుయువత, ఐటీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతులు సులభతరం

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 1: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధించిన అన్ని రకాల అనుమతులను మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి సులభతరం చేసిందని ఎస్పీ కేవీ మహే శ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'గతంలో ఎవ రైనా వినాయక మండపం ఏర్పాటు చేయాలంటే అగ్నిమాపక, పురపాలక, విద్యుత్తు, పోలీసు శాఖల నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) తీసుకోవలసి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బందులు తప్పాయి. ప్రజలు 79950 95800 మొబైల్ నెంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అనే సందేశం పంపి స్తే, ఎన్‌వోసీ ప్రక్రియ మొత్తం మొబైల్ ఫోన్‌కు వస్తుంది. కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీసు స్టేషన్ పరిధి, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ ఏ రోజు జరుగు తుంది, నిమజ్జనం ఎక్కడ, ఏ సమయంలో చేస్తారు, ఏ వాహ నం ద్వారా నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తును పరిశీలించి పోలీసు, పురపాలక, అగ్నిమాపక, విద్యుత్తు శాఖల సిబ్బంది ఒక బృందంగా ఏర్పడి, మండపం ప్రదేశాలను సందర్శిస్తారు. నియమాలకు అనుగుణంగా ఉంటే మీసేవాలో చలానా కట్టేందుకు అనుమతి ఇస్తారు. అనంతరం ఫోన్ నెంబరుకు ఎన్‌వోసీ, పాటించాల్సిన నిబంధనలు వస్తాయి. క్యూఆర్ కోడ్‌ను ల్యామినేట్ చేసి ఉత్సవ మండపంలో అందుబాటులో ఉంచాలి.' అని ఎస్పీ తెలిపారు.



నిబంధనలు ఇవీ..

- వినాయక ఉత్సవ విగ్రహాలను రోడ్డుకు అంతరాయం లేకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేసుకోవాలి.
- కమిటీ సభ్యుల ఆధార్, చిరునామాలు, ఫోన్ నెంబర్లు, పూజల వివరాలు తీసుకోవాలి.
- మండపాల వద్ద అధిక శబ్దం చేసే స్పీకర్లు వినియోగించరాదు. ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు మాత్రమే వాటిని వినియోగించాలి.
- నిమజ్జనం చేసే రూట్ మ్యాప్‌ను, వాడే వాహనం వివరాలు ముందుగా పోలీసులకు తెలియజేయాలి.
- విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- మండపాల వద్ద, ఊరేగింపులో బాణసంచాను ఉపయోగించరాదు.
- నిమజ్జనం సమయంలో అశ్లీల నృత్యాలు, డీజే శబ్దాలు ఎక్కువగా ఉండరాదు.
- బలవంతపు వసూళ్లు, దర్శనాలకు టిక్కెట్లు పెట్టరాదు.
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కృత్రిమ రంగులు ఉపయోగించిన విగ్రహాలను ఉపయోగించరాదు. మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలి.
- నిమజ్జనం రాత్రి 10 గంటలలోగా ముగించాలి.





బాలయ్యతో కలసి ఓ ఫ్యాక్షన్ సినిమా చేయాలని ఉంది

నందమూరి బాలకృష్ణ నటుడిగా సినీ ఇండస్ట్రీలో యాభై వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర పరిశ్రమ, అభిమానులు కలసి ఆదివారం బాలయ్య సినీ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నోవాటెల్ ఆడిటోరియమ్ వేదికగా జరిగిన ఈ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.దీనికి నందమూరి కుటుంబ సభ్యులతో పాటు మెగాస్టార్ చిరంజీవి, కమల్‌హాసన్, మోహన్‌బాబు, వెంకటేశ్, టి. సుబ్బరామిరెడ్డి, రఘు రామ కృష్ణం రాజు, కె. రాఘవేంద్రరావు, మురళీమోహన్, విజయేంద్ర ప్రసాద్, అశ్వినీదత్, సుహాసిని, మంచు విష్ణు, మాలాశ్రీ, నవీన్, రవి శంకర్, గోపీచంద్, బోయపాటి శ్రీను, పి.వాసు, జయసుధ కుటుంబం, విశ్వక్ సేన్, తదితరులు పాల్గొన్నారు. కన్నడ పరిశ్రమ నుంచి శివ రాజ్ కుమార్, ఉపేంద్ర కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'తెలుగు చిత్ర పరిశ్రమ అంతా కలిసి ఇలా వచ్చినందుకు అభినందిస్తున్నాను. 110 సినిమాలు చేయడం చాల కష్టం, మీరు 50 ఏళ్ల నుంచి సినిమాలు చేసినందుకు అభినందనలు. మీకు ఓపిక ఉన్నంత వరకు, ఊపిరి ఉన్నంత వరకు మీరు సినిమాలు చేయాలి. మేము అంతా మీతో ఉంటాం. జై బాలయ్య అనేది ఒక మంత్రం, అందులో ఉన్నంత ఎనర్జీ ఇంకా ఇక్కడ ఉండదు' అన్నారు. ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ 'బాలకృష్ణగారితో అసెంబ్లీలో కూర్చుంటూ ఉంటాం. ఇప్పుడు ఈ ఫంక్షన్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో వరదల కారణంగా ముఖ్యమంత్రిగారు రాలేకపోయారు. ఆయన తరపున నేను వచ్చాను. బాలయ్య గారు సినిమా రంగంలో, వైద్య సేవ రంగంలో, రాజకీయ రంగంలో ఇలాగే కొనసాగాలి అని, దేవుడు మిమ్మల్ని నిండు నూరేళ్ళు చల్లగా ఉండేలా దీవించాలని కోరుకుంటున్నాను' అన్నారు. చిరంజీవి మాట్లాడుతూ 'ఇది బాలయ్యకు మాత్రమే కాదు తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన వేడుక.



చిరంజీవి

అరుదైన రికార్డ్‌ను బాలయ్య సొంతం చేసుకున్నందుకు ఆనందంగా ఉంది. ఎన్టీఆర్‌గారికి ప్రజల మదిలో ప్రత్యేక స్థానం ఉంది. బాలకృష్ణ తండ్రి చేసిన పాత్రలు సైతం చేసి ప్రేక్షకులను మెప్పించడం సామాన్యమైన విషయం కాదు. నేను ఇంద్ర సినిమా చేయడానికి కారణం బాలకృష్ణ చేసిన 'సమరసింహారెడ్డి' చిత్రం. బాలయ్యతో కలసి ఓ ఫ్యాక్షన్ సినిమా చేయాలన్నది నా కోరిక' అన్నారు.

కమల్ హాసన్ మాట్లాడుతూ 'అందరినీ గుర్తుపెట్టుకుని పలకరించే సంస్కారం ఉన్న వ్యక్తి బాలయ్య. ఆయనకు తండ్రి, దైవం, గురువు ఒక్కరే.. ఎన్టీఆర్ గారు. బాలయ్య అంటే స్వచ్ఛమైన మనసు, స్వేచ్ఛగా ఉండే మనిషి. ఆయన నిండు నూరేళ్ళు ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో బావుండాలి అని కోరుకుంటున్నాను' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'బాలయ్య గారు మీరు యాభై ఏళ్లు ఇలా నటనా రంగంలో ఉండటం, వైద్య రంగంలో ఇలా సేవ చేయడం మేము చూస్తూనే పెరిగాం. నాకు తెలిసిన వాళ్ళు కూడా మీ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. మీరు ఎప్పుడూ ఇలాగే నవ్వుతూ ఉండాలి' అన్నారు.




లింగవివక్ష, మహిళలపై లైంగిక వేధింపులపై మాలీవుడ్ చిత్ర పరిశ్రమ అట్టుడుకుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ప్రకంపనలు క్రమంగా తెలుగు చిత్రపరిశ్రమను కూడా తాకుతున్నాయి. జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెలువడిన నేపథ్యంలో చిత్ర పరిశ్రమలోని మహిళలపై వేధింపులను నిరసిస్తూ టాలీవుడ్ కథానాయిక సమంత మరోసారి గళం విప్పారు. టాలీవుడ్‌లో మహిళలపై జరుగుతున్న వేధింపులపై 2019లో ఏర్పాటు చేసిన సబ్ కమిటీ నివేదికను ఇప్పుడు బయటపెట్టాలని ఆమె తెలంగాణ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దాన్ని బహిర్గతం చేయడం వల్ల తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను అరికట్టేందుకు అవసరమైన విధి విధానాలను రూపొందించడంలో ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. వాయిస్ ఆఫ్ ఉమెన్ ఇన్ టీఎఫ్ఐ పేరుతో ఆమె సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. ఇండస్ట్రీలో మహిళా సమానత్వం, సురక్షితమైన పని వాతావరణాన్ని సృష్టించడం చాలా ముఖ్యం అని సమంత అభిప్రాయపడ్డారు. ఆ దిశగా అందరూ కలసి కృషి చేయాలని కోరారు. నటి మంచు లక్ష్మి, దర్శకురాలు నందినిరెడ్డి, గాయని చిన్మయి శ్రీపాద యాంకర్ సుమ కనకాల సహా పలువురు నటీనటులు సమంత సందేశాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసి ఆమెకు మద్దతు తెలిపారు.

2019 నాటి సబ్ కమిటీ నివేదికను బయటపెట్టండి

- తెలంగాణ ప్రభుత్వాన్ని కోరిన సమంత
- మద్దతు పలికిన సినీ ప్రముఖులు



ఆ నివేదికలో ఏముంది?

2018లో నటి శ్రీరెడ్డి మహిళల పట్ల ఇండస్ట్రీ వివక్ష చూపుతోందంటూ ఫిల్మ్ ఛాంబర్ వద్ద నగ్నంగా నిరసన ప్రదర్శనకు దిగారు. ఆ ఘటన నేపథ్యంలో 2019లో సీనియర్ ప్రభుత్వ అధికారులు, పోలీసులు, పౌర సమాజ ప్రతినిధులతో ప్రభుత్వం ఓ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. లైంగిక వేధింపులు, లింగ వివక్ష, వేతనాలు సహా పలు సమస్యలపై ఇండస్ట్రీలోని సంఘాలతో చర్చించిన కమిటీ 2022లో ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అయితే ఇప్పటివరకూ దాన్ని ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. కానీ మీడియాలో ప్రచారం జరిగిన దాని ప్రకారం... మహిళలను వేధించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించడం ఇండస్ట్రీలో సాధారణంగా మారింది. అలాగే నైట్ షిఫ్ట్‌లో పనిచేసేవారికి రవాణా సదుపాయం కల్పించడం లేదు. వేధింపులపై నోరు విప్పిన వారిని దోషుల్లా చూస్తున్నారు. యూనియన్ సభ్యత్వాల విషయంలో మహిళల పట్ల వివక్ష చూపుతున్నారు. చాలా యూనియన్లలో మహిళల సభ్యత్వం నాలుగు శాతానికి మించలేదు. దళారీ వ్యవస్థను ఉపయోగించుకొని నిర్మాతలు తక్కువ పారితోషికాలతో పని చేయించుకుంటున్నారు. డాన్స్, యాక్టింగ్ స్కూల్స్ నుంచి వచ్చే అమ్మాయిలను దళారులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. పని ప్రదేశాల్లో మహిళల సంరక్షణ కోసం ఉద్దేశించిన చట్టాలను పరిశ్రమలోని సంస్థలు అమలు చేయడం లేదు, ఫిర్యాదుల స్వీకరణకు అంతర్గతంగా కమిటీలను ఏర్పాటు చేయాలని, అందులో మహిళలు సభ్యులుగా ఉండేలా చూడాలని కమిటీ నివేదికలో పేర్కొన్నట్లు అప్పట్లో మీడియాలో ప్రచారం జరిగింది.

ఆ దిశగా ముందడుగు వేద్దాం

ఇండస్ట్రీలో మహిళల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, పరిశ్రమ సంఘాలు కలసి రావాలని సమంత అభ్యర్థించారు. సినీ ఇండస్ట్రీలోని పని ప్రదేశాల్లో లింగ వివక్ష ఏ రూపంలో ఉన్నా అరికట్టాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. హేమ కమిటీ నివేదికను ఉదహరిస్తూ పలు సూచనలు చేశారు. ఆ నివేదిక వచ్చాక చిత్ర పరిశ్రమలోని మహిళల్లో ధైర్యం వచ్చిందన్నారు. పని ప్రదేశాల్లో తాము ఎదుర్కొంటున్న వివక్ష దోపిడీని ప్రశ్నించేందుకు మరింత మంది మహిళలు తమ మౌనం వీడి ముందుకు రావడం మంచి పరిణామం అని చెప్పారు. లింగ అసమానతను అరికట్టేందుకు పారదర్శకమైన వ్యవస్థను కమిటీ సిఫారసు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తదనుగుణంగా లింగ వివక్ష లేని వాతావరణాన్ని పరిశ్రమలో కల్పించేందుకు ప్రభుత్వం, మూవీ ఆర్గనైజేషన్లు కలసి పనిచేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఆ దిశగా పునరాలోచిద్దాం, పునర్నిర్మిద్దాం, ముందడుగు వేద్దాం అని సమంత చెప్పారు.

సినిమా బతకాలి

మాలీవుడ్‌ను పవర్ సెంటర్ నియంత్రిస్తుందన్న హేమ కమిటీ వ్యాఖ్యలను నటుడు మమ్ముట్టి ఖండించారు. అలాంటిదేమీ ఇండస్ట్రీలో లేదు అని వివరణ ఇచ్చారు. అంతిమంగా సినిమా బతకాలనేదే తన కోరిక అని చెప్పారు. ఆయన ఆదివారం సోషల్ మీడియాలో స్పందించారు. 'నివేదిక కోర్టు ముందు ఉంది, నిందితులకు కోర్టు శిక్షలు నిర్ణయిస్తుందని చెప్పారు. షూటింగ్ ప్రదేశాల్లో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు కమిటీ చేసిన సూచనలను స్వాగతిస్తున్నాను, వాటి అమలు కోసం పరిశ్రమలోని అన్ని సంఘాలు ఏకతాటిపైకి రావాలి, మహిళలకు ఇబ్బందికర పరిస్థితులు రాకుండా దర్శక నిర్మాతలు జాగ్రత్తలు తీసుకోవాల'ని సూచించారు. హేమ కమిటీ నివేదిక గురించి స్పందించాలని మీడియా కోరగా దాని గురించి తనకేం తెలియదని రజనీకాంత్ బదులిచ్చారు.

భయపడేది లేదు

నటుడు జయసూర్య తనను వేధించాడంటూ నటి సోనియా మల్హర్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదైంది. అయితే ఆ ఆరోపణల్లో నిజం లేదని జయసూర్య ఓ ప్రకటనలో తెలిపారు. తనపై తప్పుడు కేసు పెట్టిందని ఆరోపించారు. న్యాయం కోసం పోరాడుతానని చెప్పారు. దీనిపై సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరింపులకు భయపడేది, లేదు నా వ్యాఖ్యలను వెనక్కు తీసుకునేది లేదు అని తెగేసి చెప్పారు. తను చెప్పిన ప్రతి అంశం నిజమేనని పేర్కొన్నారు.

రిలీజ్ డేట్ మారింది



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం ఈ నెల 7న విడుదల కావాలి. అయితే అనివార్యకారణాల వల్ల విడుదల తేదీని వాయిదా వేసినట్లు, 13న రిలీజ్ చేస్తామని చిత్ర నిర్మాత ఎన్.వి కిరణ్‌కుమార్ చెప్పారు. దర్శకుడు మారుతి సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివ సాయి వర్ధన్ దర్శకుడు. సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఈ సినిమాలో కీలక పాత్ర పోషించారు. అమ్మాయిలకు అందంగా అలంకరణలను చేసే పాత్రను ఇందులో రాజ్‌తరుణ్ పోషించారు. శేఖర్ చంద్ర సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి నగేశ్ బానెల్లా ఛాయాగ్రాహకుడు.

రెండు ముఖాలు



నిఖిల్ దేవాదుల హీరోగా నటిస్తున్న 'ఘటికాచలం' చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఇందులో హీరో రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తున్నారు. ఒక లుక్ ఇన్నోసెంట్‌గా, మరో లుక్ ఇంటెన్స్‌గా ఉంది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో ఈటీవీ ప్రభాకర్, ఆర్విక గుప్తా, జోగినాయుడు, సంజయ్‌రాయ్, దుర్గాదేవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. అమర్ కామెపల్లి దర్శకుడు. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్రకథకుడు, నిర్మాత ఎం.సి.రాజు చెప్పారు.

మన బతుకులు కలలు కావు.. కళలు



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషించిన 'ఉత్సవం' సినిమా థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేశారు. హాస్యనటుడు బ్రహ్మానందం స్టేజ్ ప్లేలోని పవర్‌ఫుల్ డైలాగుతో ట్రైలర్ మొదలైంది. 'మన బతుకులు కలలు కావు.. కళలని గుర్తించే రోజులు రావా' అని ప్రకాశ్‌రాజ్ చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. దిలీప్, రెజీనాల లవ్‌ట్రాక్ ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ. నాటకాలు అంటే ఇష్టపడే యువతిగా రెజీనా నటించారు. ఈ నెల 13న విడుదలయ్యే 'ఉత్సవం'లో నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ, ప్రేమ, ఎల్బీ శ్రీరామ్ తదితరులు నటించారు. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ ఈ సినిమాను నిర్మించారు.



సున్నా నుంచి 35 మార్కులు

నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజా ప్రధాన పాత్రలు పోషించిన '35.. చిన్న కథ కాదు' చిత్రం ట్రైలర్‌ను అక్కినేని నాగార్జున ఆదివారం విడుదల చేశారు. లెక్కల సబ్జెక్ట్‌తో ఇబ్బంది పడుతున్న ఓ స్టూడెంట్‌ను పరిచయం చేస్తూ ట్రైలర్ మొదలైంది. ఆ పిల్లాడి తల్లితండ్రులుగా నివేద, విశ్వదేవ్ నటించారు. కొడుకు భవిష్యత్ గురించి ఆందోళన చెందుతుంటారు. ఆ పిల్లాడిని టీచర్, క్లాసులో ఇతర స్టూడెంట్స్ 'సున్నా' అని పిలుస్తూ అవహేళన చేస్తుంటారు. ఆ కుర్రాడు సవాళ్లను అధిగమించి, 35 మార్కులతో ఉత్తీర్ణత సాధించడం ఈ చిత్రకథ. దర్శకుడు నందకిశోర్ ఈమని ఆసక్తికరంగా రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదలవుతోంది. రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు.

తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు



హారర్ థ్రిల్లర్ 'డీమాంటీ కాలనీ 2' చిత్రాన్ని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు హీరో అరుల్ నిధి ధన్యవాదాలు తెలిపారు. ఆగస్టు నెలలో విడుదలైన ఈ చిత్రాన్ని బి.సురేశ్‌రెడ్డి, మానస రెడ్డి తెలుగు ప్రేక్షకులకు అందించారు. ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో అరుల్ నిధి మాట్లాడుతూ ' తమిళంలో మా సినిమా బాగా ఆడుతోంది. తెలుగులో నిర్మాత సురేశ్‌రెడ్డి బాగా ప్రమోట్ చేశారు. ఆయన వల్లే సినిమా ఇంత పెద్ద విజయం సాధించింది. త్వరలో హైదరాబాద్ వచ్చి సక్సెస్ మీట్ నిర్వహిస్తాం' అన్నారు. ఈ సినిమాకు మరో రెండు సీక్వెల్స్ వస్తాయనీ, 'డీమాంటీ కాలనీ 3' భారీ స్థాయిలో ఉంటుందని, ఇందులో ఊహించని మలుపులు ఉంటాయనీ అరుల్ నిధి చెప్పారు. 'ఈ సినిమా పార్ట్ వన్‌లో ఒక పాత్ర చేశాను. పార్ట్ 2 లో రెండు పాత్రలు పోషించాను. పార్ట్ 3లో దర్శకుడు అజయ్ ఎన్ని పాత్రలు చేయిస్తారో చూడాలి. ఇంతవరకూ ఎక్కువగా థ్రిల్లర్, సస్పెన్స్ మూవీస్ చేశాను. ఇకపై ఇతర చిత్రాల్లో కూడా నటించాలనుకుంటున్నాను' అని చెప్పారు అరుల్ నిధి.

ఇన్ ప్రోగ్రెస్

రెండేళ్ల కృషి ఫలించింది



యం.యస్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఇటీవల ఈ చిత్రం విడుదలై అందరినీ అలరిస్తున్న సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సాగర్ మాట్లాడుతూ 'రెండేళ్ల మా కృషి ఫలించింది. మా సినిమాకు స్పందన బాగుంది. స్టార్స్ లేకున్నా కొత్త నటీనటులను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మా సినిమాలో హీరోయిన్లు ముగ్గురూ బాగా చేశారు. కిరాక్ కిరణ్ పాత్ర బాగా పండింది' అన్నారు. హీరోయిన్లు హన్సిక శ్రీనివాస్, ఉమా రేచర్ల, శ్రుతీ శంకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాపం ఎవరిది.. శాపం ఎవరికి?

- కొమ్మలు కొట్టాల్సిన చోట చెట్ల మొదలే నరికి..
- పర్యావరణానికి విఘాతం ● ట్రాన్స్‌కో, అటవీ శాఖల సమన్వయ లోపం



(టెక్కలి)

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు.. చెట్లతోనే భవిష్యత్.. అవి లేకుంటే మానవ మనుగడకే ప్రమాదం.. ఇది ప్రతి ఒక్కరికీ తెలుసు.. ఈ విషయమై ప్రభుత్వాలు సైతం తరచూ ప్రచారం చేస్తూ వనమహోత్సవాలు నిర్వహిస్తూ అవగాహన కలిగిస్తుంటాయి.. స్వచ్ఛంద సంస్థలూ ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం అవుతుంటాయి. ఒక మొక్క పెరిగి, పెద్దది అయ్యే సరికి కొన్నేళ్లు పడుతుంది. తీరా ఆ చెట్లు నీడని, ఆక్సిజన్‌ను అందించే సమయానికి కోతకు గురవుతుంటే జీవరాసుల భవితవ్యం అగమ్య గోచరమే.. ఇది తెలిసి కూడా ఆ రెండు శాఖలు సమన్వయ లోపంతో పచ్చని చెట్లు నేలకూలుతున్నాయి.. దీనికి సజీవ సాక్ష్యంగా నౌపడా-మెళియాపుట్టి రోడ్డు మార్గంలో వందల సంఖ్యలో చెట్లే నిలుస్తున్నాయి.. ఈ పాపం ఎవరిది.. ఎవరికి శాపమో తెలియని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవాన్ని 100 రోజుల పండుగగా చేపట్టాలని ఆదేశించింది. శుక్రవారం ఈ కార్యక్రమాన్ని ఓ ఉద్యమంలా శ్రీకారం చుట్టింది. అదే రోజు ఈ మార్గంలో వందలాది చెట్లపై గొడ్డలి వేటు వేయడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలను నాటుతుండగా విద్యుత్ వైర్లకు తగులుతున్నాయంటూ ఆ శాఖాధికారులు కొమ్మలు తొలగించకుండా ఏకంగా మొదలు వద్దే నరికివేయడాన్ని చూసిన పర్యావరణ మిత్రులు అల్లాడుతున్నారు.

గొడ్డలి వేటుతో..

అటవీశాఖ సోషల్ ఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో గత పుష్కర కాలంగా నౌపడా-మెళియాపుట్టి మార్గంలో రోడ్లకు ఇరువైపులా తురాయి, బాదం, కానుగ, దేవకాంచన, తెల్లమద్ది, గంగిరావి, పేతోడియా తదితర మొక్కలను కిలోమీటరుకు 400 మొక్కల చొప్పున, లక్షలాది వ్యయంతో పెంచి పెద్ద చేశారు. ఇప్పుడవి పెరిగాయి. అయితే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందంటూ ట్రాన్స్‌కో సిబ్బంది కొమ్మలను కొట్టకుండా మొదల్లోనే నరికివేశారు. నిబంధనల మేరకు కొమ్మలను మాత్రమే తొలగించాలి. అయితే ఆ నిబంధనలను తుంగలో తొక్కేస్తుండడంపై పర్యావరణ పరిరక్షకులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇటువంటి ఘటనలు తరచూ సంభవిస్తున్నాయి. ఇరుశాఖలు సమన్వయలోపంతో తప్పును ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ కాలంగడిపేస్తున్నారు. వీరి మధ్య పచ్చని చెట్లు నెలకూలుతున్నాయి.



నౌపడా-మెళియాపుట్టి రోడ్డులో గొడ్డలివేటు పడిన చెట్టు

ఇప్పటికైనా కొమ్మల నరికివేతపై ఇరు శాఖలు ఒక స్పష్టమైన విధానాన్ని అమలు చేసి చెట్లను సంరక్షించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై అటవీ రేంజ్ అధికారి జగదీశ్వరరావు వద్ద ప్రస్తావించగా మొక్కలను రెండు, మూడేళ్ల వరకు పెంచడం తమ బాధ్యత అని, ఆ తరువాత వాటిని ఆయా పంచాయతీలకు అప్పగిస్తామన్నారు. పెంచిన చెట్ల వల్ల విద్యుత్ సమస్య తలెత్తితే కొమ్మలు మాత్రమే తొలగించాల్సి ఉంటుందన్నారు. అలాగే ట్రాన్స్‌కో ఏఈ ఈశ్వరరావు వద్ద ప్రస్తావించగా విద్యుత్ లైన్ కింద చెట్లు పెంచడం తగదని, అవి లైన్లకు తగిలి విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని, అందుకే తొలగించాల్సి వస్తోందని చెప్పారు.

సీతంపేట ఐటీడీఏ డీడీ కార్యాలయం శ్రీకాకుళం తరలించాలి

టెక్కలి: సీతంపేట ఐటీడీఏ పరిధిలో డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయాన్ని శ్రీకాకుళానికి తరలించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం జిల్లాల విభజన చేసి ఆదివాసీలకు జిల్లాలో ఐటీడీఏ లేకుండా అన్యాయం చేసిందన్నారు. జిల్లాకు చెందిన ఆదివాసీలు ఐటీడీఏ ఈ ప్రాంతంలో ఉండాలని పెద్దఎత్తున ఉద్యమాలు, నిరాహార దీక్షలు చేస్తే డీడీ కార్యాలయం కలెక్టరేట్‌లో పెట్టాలని, గెజిట్ నోటిఫికేషన్ ద్వారా జీవో విడుదల చేసినా నేటి వరకు అధి కారులు స్పందించడం లేదన్నారు. జిల్లాలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు ఆదివాసీలకు న్యాయం చేయా లని కోరారు. సీఎం చంద్రబాబునాయుడు శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని గతంలో హామీ ఇచ్చా రని, మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ కేంద్రం ఏర్పాటు చేసేవరకు ఉద్యమాలు చేపడ తామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్దేశపూర్వకంగా ఫ్లెక్సీలు చించడం తగదు

మెళియాపుట్టి: డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఉద్దేశపూర్వకంగా చించివేయడం తగదని ఆ పార్టీ నాయకుడు దుక్క బాలరాజు అన్నారు. ఆదివారం చించివేసిన ఫ్లెక్సీని పరిశీలించారు. హిరమండలం, మెళి యాపుట్టి మహేంద్రతనయ నది సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించి వేశారన్నారు. పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వ లేక ఇటువంటి పనులు చేస్తుండడం దారుణమన్నారు. వీటికి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

జనరేటర్ దగ్ధం

నందిగాం: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని జనరేటర్ షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం దగ్ధ మైంది. ఉదయం వర్షం పడిన సమయంలో ఒక్కసారిగా జనరేటర్ నుంచి మంటలు రేగాయి. దగ్ధమైన విషయాన్ని టెక్కలి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక అధికారి బి.సూర్యారావు సిబ్బందితో వచ్చి మంటలను అదుపుచేశారు.

వన్ స్టాప్ సెంటర్లను వినియోగించుకోండి

జలుమూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వన్‌స్టాప్ సెంటర్లను బాలికలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కేస్ వర్కర్ బి.కవిత తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సెంటర్లలో కౌన్సెలింగ్, న్యాయసహాయం, ఆశ్రయం, వైద్య, పోలీసు సహాయాలను అందిస్తారన్నారు. బాలికలు, మహిళలకు ఎటువంటి అన్యాయం జరిగినా 100, 1098, 181, 112 హెల్ప్‌లైన్ నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

హిరమండలం: వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి మందిర ఏర్పాటుకు అనుమతులు పొందాలని ఎస్ఐ మహమ్మద్ యాసిన్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వినా యక మండపాలు ఏర్పాటు స్థలం ప్రభుత్వానిదైతే సంబంధితశాఖ అధికారుల నుంచి, ప్రైవేటు వ్యక్తుల స్థలం అయితే యజమానుల నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలన్నారు. అనంతరం అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అగ్ని మాపక, విద్యుత్ శాఖ, పోలీస్, పంచాయతీ అధికారుల నుంచి నిరభ్యంతర పత్రం పొందాలన్నారు.

గోతుల్లోని నీటి తొలగింపు



హిరమండలం: హిరమండలం బస్టాండ్ ఎదురుగా రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో చేరిన వర్షపు నీటిని పంచాయతీ సిబ్బంది ఆదివారం తొలగించే చర్యలు చేపట్టారు. రోడ్డుపై చేరిన నీటితో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో పంచాయతీ అధికారులు స్పందించి నీటిని తొలగిం చారు. అయితే రోడ్డును తక్షణం బాగు చేయాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



నిరసన తెలుపుతున్న ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది

పాతపట్నం: ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కోర్టు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏపీ స్టేట్ బెవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సంఘ నాయకులు మాట్లాడుతూ.. మద్యం దుకాణాల ప్రైవేటీకరణపై ప్రభుత్వం తీసుకోనున్న నిర్ణయం వల్ల తామంతా వీధిన పడతామని వాపోయారు. ప్రభుత్వ నిర్ణయాలకు తామువ్యతిరేకం కాదని అయితే ఇప్పటికే పనిచేస్తున్న సిబ్బంది కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట మండలాల మద్యం దుకాణాల సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్ భవన పునర్నిర్మాణానికి విరాళం



పాఠశాల అభివృద్ధికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మందస: తాము చదువుకున్న పాఠశాల భవన పునర్నిర్మాణానికి పూర్వ విద్యార్థులు విరాళం అందించారు. స్థానిక శ్రీరాజా శ్రీనివాస ఉన్నత పాఠశాలలో 1990-91లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం తమ వంతు సాయంగా రూ.2.5 లక్షలు విరాళంగా అందించి తమ పాఠశాల పట్ల అభిమానాన్ని చాటుకున్నారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన

నందిగాం: అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురవడంతో అధికారులు ఆదివారం గ్రామాల్లో పర్యటిం చారు. ఎంపీడీవో టి.రాజారావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.భాగ్యలక్ష్మి కర్లపూడి, పోతులూరు, పెద్ద తామరాపల్లి తదితర గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా వర్షాల వల్ల ఇళ్లకు గాని, పంటలకు గాని నష్టం వాటిల్లిందా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్ఐ టి.కిరణ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు అండగా ప్రభుత్వం



నరసన్నపేట: ఎమ్మెల్యే రమణమూర్తిని అభినందిస్తున్న పారిశుధ్య కార్మికులు

నరసన్నపేట: పారిశుధ్య కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నరసన్నపేట మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు కలిసి అభినందించారు. ఇటీవల ప్రభుత్వం వేతనాలు పెంచడంపై కార్మికులు హర్షం వ్యక్తంచేశారు. విధులను అంకితభావంతో చేపట్టాలని ఆయన సూచించారు. పంచాయతీ కార్యాలయంలో విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని వారు కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారు.

ప్రతి సోమవారం వినతుల స్వీకరణ

కత్తెరవానిపేట(పోలాకి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతి సోమవారం కత్తెరవానిపేట క్యాంపు కార్యాలయంలో వినతులు స్వీకరించనున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమ ణమూర్తి తెలిపారు. ఆదివారం కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమీక్షించారు. ప్రజలు నేరుగా వచ్చి సమస్యలు తెలిపేలా కూటమి నేతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎంఈ నాయుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కుమార్ నాయక్‌కు ఉద్దానబంధు అవార్డు ప్రదానం



కుమార్‌నాయక్‌ను సత్కరిస్తున్న కళాకారులు, నిర్వాహకులు

వజ్రపుకొత్తూరు: ప్రముఖ జానపద కళాకారుడు డాక్టర్ కుమార్‌నాయక్‌కు ఉద్దానబంధు అవార్డును ప్రదానం చేశారు. ఆదివారం డోకులపాడులో ఉద్దాన సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సాహితీ సదస్సు నిర్వహించారు. ఉద్దానంలో కళల అభివృద్ధికి కుమార్ నాయక్ చేస్తున్న కృషికి గాను ఈ అవార్డు ను అందించినట్లు వేదిక అధ్యక్షుడు లండ రుద్రమూర్తి తెలిపారు. అనంతరం పాటల పోటీలు, కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ, వడ్డి కరుణాకర్, జనసేన నాయకుడు లండ గిరిబాబు, సిక్కోలు వేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజు, కవులు బమ్మిడి సుబ్బారావు, తెప్పల కృష్ణమూర్తి, కుత్తుం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తిలారు ఉన్నత పాఠశాలలో 1984-89 చదివిన విద్యార్థులు

నరసన్నపేట: నరసన్నపేట సమీపంలోని తిలారు ఉన్నత పాఠశాల 1984-89 సంవత్సరా మధ్య ఆరు నుంచి పదోతరగతి వరకు చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానికంగా ఓ కల్యాణ మండపంలో జరిగింది. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందం పొందారు. ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిరపడిన వారిని మిత్రులు సత్కరించారు. ఆర్థికంగా వెనుకబడిన సహచరుల పిల్లల చదువులకు చేయూత ఇచ్చేందుకు పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీధర్, జోగారావు, ఎంఎల్ నారాయణ, శ్రీను, భీమా, శశి, ప్రసాద్, వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంప్‌ను పరిశీలించిన ఆర్డీవో



కొత్తూరు: ఆకులతంపర ఇసుక ర్యాంప్‌ను టెక్కలి ఆర్డీవో సుదర్శనదొర ఆదివారం సందర్శించారు. శుక్రవారం రాత్రి ఇసుక అక్రమ తరలింపుపై ఆరా తీశారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమరాజపురం వద్ద ఇసుక అక్రమ రవాణా జరగకుండా పోలీస్, వీఆర్వో, వీఆర్ఏ రాత్రిపూట గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. నాటుబండిపై ఇసుక తరలించే వారు పంచాయతీ కార్యదర్శి నుంచి తప్పనిసరిగా అనుమతి పత్రం తీసుకోవాలన్నారు. డీటీ సత్యనారాయణ, వీఆర్వో శంకరరావు పాల్గొన్నారు.

ఒడిశా

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

పర్లాకిమిడి: పర్లాకిమిడి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రూపేష్ కుమార్ పాణిగ్రాహి అన్నారు. ఆదివారం పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారం భించారు. ముక్తా పథకంలో సుభాష్ నగర్‌లో ఏర్పాటు చేసి మినీ పార్క్‌ను ప్రారంభిం చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నిర్మలా శెట్టి, వైస్ చైర్మన్ లెంక మధు, కౌన్సిలర్ అమ్ములమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌కు సంస్కృతం పునాది

పర్లాకిమిడి: సైన్స్‌కు సంస్కృతం పునాది అని జిల్లా విద్యాశాఖాధికారి మాయధర్ సాహు అన్నారు. పట్టణంలోని సంస్కృత విద్యాలయంలో సంస్కృతభాషా దినోత్సవాన్ని ఉత్కళ శిక్ష్యా సంస్కృత మహా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృత భాష ప్రాముఖ్యను, గొప్పదనాన్ని వివరించారు. ఆర్యభట్ట, చార్వకుడు, గౌతముడు, పతంజలి తదితర రుషులు ప్రపంచానికి కొత్తదశను అందించారని, అదే నేడు సైన్స్ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. సంస్కృతం దైవభాష అని, దీనిని ఆదరించాలని కోరారు.

పెన్షన్‌పై ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

- మంత్రికి ఏపీసీపీఎస్‌ఈఏ నాయకుల వినతి



మంత్రి అచ్చెన్నాయుడికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు

సంతబొమ్మాళి: ఎన్నికలకు ముందు ఓపీఎస్ అమలు చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టు కోవాలని ఏపీసీపీఎస్ ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డి సూరాబాబు కోరారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని కోరుతూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా విద్రోహదినంగా పాటించామన్నారు. ఈ మేరకు ఆదివారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. సీపీఎస్ సమస్య పరిష్కరిస్తామని టీడీపీ ఇచ్చిన హామీ మేరకు కూటమి విజయానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు మద్దతు పలికారన్నారు. ఉద్యోగుల ఆకాంక్ష ఓపీఎస్ అని, అందువల్ల ప్రభుత్వ రోడ్ మ్యాప్ ప్రకటించి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అలాగే ఇచ్ఛాపురం, నరసన్నపేట, శ్రీకా కుళం, ఆమదాలవలస ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందించా మన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తలగాన చంద్రశేఖర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి బాడాన రాజు, ఉపాధ్యక్షుడు ఉదేపురం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాల్సిందే..

టెక్కలి: పాత పెన్షన్ విధానం అమలుచేయాలని ఏపీటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీటీఎఫ్‌కు చెందిన రెండు ఉపాధ్యాయ సంఘాలు వేర్వేరుగా ఆదివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ (1938) నాయకులు వజ్జ ఆదినారాయణ, సురేష్‌కుమార్, గున్న ప్రసాదరావు మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దయ్యే వరకు తమ పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. అలాగే ఇందిరాగాంధీ కూడలిలో సీపీఎస్ రద్దు కోరుతూ ఏపీటీఎఫ్ (257) శాఖ నేతలు నిరసన తెలిపారు. జీపీఎస్, యూపీఎస్ లాంటి మోసపూరిత పెన్షన్ స్కీమ్‌లు అంగీకరించే ప్రసక్తే లేదని, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని ఆ సంఘ నాయకులు బొడ్డేపల్లి నేతాజీ, బాబూరావు, శ్రీనివాసరావు తదితరులు కోరారు.

ఏపీటీఎఫ్ నిరసన

కొత్తూరు: పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఏపీటీఎఫ్ కొత్తూరు మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.శాంతారావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలకు సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌ల వల్ల తీవ్ర నష్టంవాటిల్లుతుందన్నారు. తక్షణం వీటిని ఉపసంహరించుకుని ఓపీఎస్‌ను అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నేతలు గణపతిరావు, బాలకృష్ణ, వి.శ్రీనివాసరావు, కె.గున్నమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలి: జేసీ



ముంపు పొలాలను పరిశీలిస్తున్న జేసీ

సుసరాం(పోలాకి): తుఫాన్ ప్రభావం ఉండడంతో మండల, క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. ఆదివారం సుసరాం తంపర ముంపు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రతిఏటీ తంపర భూముల్లో పంట సమస్యలను వివరించారు. గుప్పెడుపేట, గుల్లవానిపేట, రాజారాంపురం గ్రామాల్లోని సాగర తీర మత్స్యకారులను, పల్లిపేట, వనిత మండలం నదీ తీరప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని జేసీ సూచించారు. తుఫాన్ షెల్టర్లను సిద్ధంగా ఉంచాలన్నారు. దండులక్ష్మీపురంలో నిర్మించిన పెద్ద తుఫాన్ షెల్టర్‌ను ఖాళీ చేయించి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో ఆర్.వెంకటరామన్, తహసీల్దార్ ఎం.సురేష్ కుమార్, ఎంపీడీవో కె.ఉషశ్రీ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎస్ఐ రంజిత్ గుప్పెడుపేట, కొత్తరేవు సాగరతీర గ్రామాల్లోని మత్స్యకారులను అప్రమత్తం చేశారు. సముద్రంలోకి వేటకు వెళ్లవద్దన్నారు.

ముత్యాలమ్మ కోనేరు-నెహ్రూపార్కు అభివృద్ధికి చర్యలు



నీటి మళ్లింపును పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

పలాస: ముత్యాలమ్మ కోనేరు-నెహ్రూ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వజ్జ బాబూరావు తెలిపారు. ఈ మేరకు కోనేరులో వరదనీటి మళ్లింపును ఆదివారం పరిశీలించారు. పార్కు అభివృద్ధిలో భాగంగా పురుషోత్తపురం ఎర్రచెరువు వరద నీటిని కోనేరులోకి ప్రత్యేక పైపులైన్ల ద్వారా విడిచిపెట్టారు. ఈ నీరు వృథాగా పెద్దకాలువ మీదుగా జగన్నాథ సాగరంలోకి కలుస్తోంది. దీన్ని మళ్లించి ముత్యాలమ్మకోనేరు నింపే కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా చేప ట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పాలకవర్గం ఏర్పడిన మొదటిసారి ఈ పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, అయితే ఆ తరువాత వచ్చిన పాలకులు నిర్లక్ష్యం వహించారన్నారు. మళ్లీ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట టీడీపీ పట్టణ కార్యదర్శి సప్ప నవీన్, కౌన్సిలర్ డిక్కల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులంతా సంఘటితం కావాలి



మాట్లాడుతున్న సునీతాదేవి

పలాస: హిందువులంతా సంఘటితమై సమస్యలపై పోరాడాలని వీహెచ్‌పీ ప్రాంత మహిళ సంయో జక టి.సునీతాదేవి అన్నారు. స్థానికంగా ఓ కల్యాణ మండపంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ 60 ఏళ్ల పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హిందువులను సంఘ టితం చేసేందుకు వీహెచ్‌పీ ఆవిర్భవించిందన్నారు. వీహెచ్‌పీ పోరాట ఫలితంగా రామ జన్మభూమిని రక్షించుకొని రాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్నామన్నారు. తిరుమల ఏడుకొండలను కాపాడుకునేందుకు ప్రభుత్వం తో పోరాడామని, గోహత్య, లవ్‌జిహాది, మతమార్పిడిలపై అనేక ఉద్యమాలు చేశామన్నారు. ప్రస్తుతం హిందువులు కులాల పేరుతో విడిపోయారని, వారం దరినీ సంఘటితం చేసేందుకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కళింగ వైశ్యసంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు మల్లా పద్మజ, వీహెచ్‌పీ ప్రతి నిధులు జి.సాయిరామ్, డి.బాలాజీ, గుప్తా, జ్యోష్ణపాత్రో, సత్యచాందిని, సవర స్వప్న, చంద్రమౌళి, ఎ.మురళీకృష్ణ, మల్లా సౌజన్య, తాళాసు కవిత పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

పాతపట్నం: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ పాటుపడాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గేదెల చైతన్య అన్నారు. డిప్యూటీ సీఎం, జనసేన పవన్ కల్యాణ్ పిలుపుమేరకు స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించేలా అధికారులు, ప్రజలు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పైల బాబ్జీ, సైలాడ సతీష్‌తో పాటు టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

కొబ్బరికి ఊపిరి పోసేనా?



తితలీ తుఫాన్‌కు నేలకొరిగిన ఉద్దానం కొబ్బరి తోటలు (ఫైల్)

కొబ్బరి పేరు చెప్తే ఉభయ గోదావరి జిల్లాల తరువాత ఠక్కున గుర్తొచ్చేది ఉద్దానం ప్రాంతమే. అటువంటి పచ్చని కొబ్బరి తోటలతో కళకళలాడిన ఉద్దానం ప్రాంతం నేడు కళావిహీనంగా మారి, ఇతర ప్రాంతాల నుంచి కొబ్బరి పంటను దిగుమతి చేసుకుంటున్న దుస్థితికి చేరింది. వరుస ప్రకృతి వైపరీత్యాలకు తోడు పాలకుల నిర్లక్ష్యం, తోడ్పాటు లేమి కారణంగా కొబ్బరి పంటపై ఆధారపడిన కుటుంబాలు నేడు పస్తులతో పొట్టచేతపట్టుకుని ఉపాధి కోసం వలసలు పోతున్నారు. తుఫాన్లు, తెగుళ్ల కారణంగా ఉద్దానంలో కొబ్బరి పంట దిగుబడులు తగ్గడమే కాకుండా కాయ పరిమాణం సైతం మారింది. గత వైసీపీ ప్రభుత్వం కొబ్బరి రైతులను కనీసం పట్టించుకోలేదు. వారికి ఎలాంటి ప్రోత్సాహం అందించలేదు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంపైనే వారు ఆశలు పెట్టుకున్నారు. ఉద్దానం కొబ్బరికి ఊపిరిపోయాలని కోరుతున్నారు. నేడు అంతర్జాతీయ కొబ్బరి దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- తెగుళ్లు, తుఫాన్లతో తగ్గిన దిగుబడులు
- ప్రోత్సాహం అందించని గత వైసీపీ సర్కారు
- కానరాని అనుబంధ పరిశ్రమలు
- ఆందోళనలో రైతులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు
- నేడు అంతర్జాతీయ కొబ్బరి దినోత్సవం

(కవిటి/కంచిలి/హరిపురం)

జిల్లాలోని కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, పలాస, సంతబొమ్మాళి మండలాల్లో 36,920 ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. ఒక్క ఉద్దానం ప్రాంతంలోనే 30 వేల ఎకరాల వరకు కొబ్బరి తోటలు ఉన్నాయి. దీర్ఘకాలం దిగుబడినిచ్చే చెట్లు (ఈస్ట్‌కోస్ట్ టాల్) ఎక్కువగా ఈ ప్రాంతంలో కనిపిస్తాయి. ఈ రకం నాటిన ఏడేళ్ల వరకు కాపునకు రావు. ఆ తర్వాత 60 నుంచి 75 సంవత్సరాల వరకు దిగు బడినిస్తాయి. అయితే, 1999 నుంచి కొబ్బరిని తుఫాన్లు వెంటాడుతూనే ఉన్నాయి. దీంతో తోటలు నాశనమవుతున్నాయి. 2018లో వచ్చిన తితలీ తుఫాన్‌తో ఉద్దానంతోపాటు వజ్రపుకొత్తూరు, పలాస, మందస, సంతబొమ్మాళి మండలాల పరిధిలో 90శాతం మేర చెట్లు నేలకూలడంతో కొబ్బరి తోటలు మైదానంలా మారాయి. దీంతో ఉద్దానం రైతులు ప్రత్యామ్నాయ ఉపాధి కోసం వెతకాల్సి వస్తుంది. కుటుంబాన్ని పోషించటానికి, అప్పులకు వడ్డీలు చెల్లించటానికి అష్టకష్టాలు పడుతున్నారు. ఏడాది పొడవునా ఆదాయాన్ని ఇచ్చే తోటలు కొన్ని చోట్ల రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోయాయి.

రైతు కంట కన్నీరు..

ఉద్దానంలో కొబ్బరి తోటలు, వాటి ఉత్పత్తులపై ప్రత్యక్ష, పరోక్షంగా 2 లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. 1999 పెను తుఫాన్ అనంతరం ఎర్రనల్లి సోకి కాయ నాణ్యత, పరిమాణాన్ని దెబ్బతీసింది. తితలీ తుఫాన్ తర్వాత తెల్లదోమ విజృంభణతో పచ్చదనాన్ని హరించటమే కాక ఉత్పత్తి తగ్గిపోయింది. వీటికి తోడు కాండం తొలుచు పురుగు ఆశించి మొక్కదశలోనే కొబ్బరి నాశనమై రైతుకంట కన్నీరు తెప్పిస్తుంది. అలాగే నల్లముట్టి పురుగు ఉధృతి పెరిగి చెట్టు పరిస్థితినే మార్చేసింది. దానికి తోడు గత ఏడాది తీవ్ర వర్షాభావంతో కొబ్బరి పంట స్థితిగతులు మారిపోయాయి. గత ఏడాది ఈ ప్రాంతం నుంచి రోజుకు సుమారుగా 320 టన్నుల సరుకుల ఎగుమతి చేస్తే, ఈ సంవత్సరం మాత్రం కేవలం 20 టన్నుల సరుకు కూడా ఎగుమతి జరగలేదని వ్యాపారులు చెబుతున్నారు. దిగుబడులు లేక వచ్చిన కాయలు పరిమాణం చిన్నదిగా మారటంతో గ్రేడులుగా విభజించి వ్యాపారులకు ఇష్టం వచ్చిన ధరలకు అమ్మకాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

వెలవెలబోతున్న కంచిలి మార్కెట్..

కొబ్బరి వ్యాపార కేంద్రమైన కంచిలి మార్కెట్ ప్రస్తుతం వెలవెలబోతుంది. గతంలో ఒక్క కంచిలి ప్రాంతంలోనే సుమారుగా 40 కొబ్బరి బడ్డీలు ఉండేవి. వాటిలో ఇంచుమించుగా 1200 మంది వరకు కూలీలు పని చేస్తుండేవారు. ప్రస్తుతం నాలుగు నుంచి ఆరు బడ్డీలు మాత్రమే ఉన్నాయి. మిగిలిన కేంద్రాలన్నీ పాత సామాన్లు విక్రయించుకునే షాపులుగా, గొడౌన్‌లుగా మారిపోయాయి. ఒడిశా వ్యాపారులు ఉద్దానం వైపు చూడటమే మానుకున్నారు. తమిళనాడు, కేరళ నుంచి కాయలను దిగుమతి చేసుకొని కొందరు వ్యాపారులు ఈ ప్రాంతం కాయలుగా చెప్పి తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు.

తగ్గిన దిగుబడి... పెరగని ధర..

ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల కారణంగా ప్రస్తుతం ఉద్దానంలో కొబ్బరి దిగుబడి గణనీయంగా తగ్గింది. దీనికితోడు జాతీయ మార్కెట్లో డిమాండ్ తగ్గడంతో ధరలు మరింత పతనమయ్యాయి. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో కొబ్బరి రైతులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం కంచిలి మార్కెట్లో వెయ్యి కొబ్బరి కాయల ధర రూ. 10 వేల నుండి రూ.12 వేలు పలుకుతోంది. చిల్లర మార్కెట్‌లో మాత్రం ధర అధికంగానే ఉంది. ప్రస్తుతం ఒక ఎకరాకి 200 నుంచి 250 కాయలు మాత్రమే దిగుబడి వస్తుంది. గతంలో ఎకరాకి 500 పైబడి కాయల దిగుబడి వచ్చేదని రైతులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో వినాయకచవితి మొదలుకొని అన్ని శుభ కార్యాలే ఉన్న నేపథ్యంలో గిట్టుబాటు ధర ప్రకటించాలని కోరుతున్నారు.

శాశ్వత చర్యలు శూన్యం..

కొబ్బరి పంటను ప్రోత్సహించి రైతులను ఆదుకుంటామని ప్రభుత్వాలు చెప్పటమే తప్ప ఇప్పటికీ శాశ్వత చర్యలు లేవని రైతులు వాపోతున్నారు. కేరళ తరహాలో చర్యలు ఏర్పడితే తప్ప కొబ్బరి తమ బతుకు మెరుగుపడదని రైతులు భావిస్తున్నారు. కేరళలో కొబ్బరి నీళ్ల నుంచి తొక్క వరకు ప్రతీది వాణిజ్యానికి అవసరంగా వాడుతున్నారు. రైతు సహకార సంఘాలతో కలసి కేరళలో కొబ్బరికాయ నుంచి 100 రకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. వీటిలో 45రోజుల వయసు కలిగిన కొబ్బరి ఆయిల్‌కు డిమాండ్ ఉంది. ఇలాంటివి మన ప్రాంతంలో లేవు. 2008లో కొబ్బరి ఉత్పత్తిదారుల సంఘం ద్వారా చికాకోల్ కోకోనట్ పార్మర్స్ ప్రొడ్యూసర్ సంస్థను ఉద్దానంలో ఏర్పాటు చేశారు. ఇందులో 10 వేల మంది వరకు రైతులను భాగస్వామ్యం చేశారు. కొబ్బరి బోర్డు ద్వారా వచ్చే పథకాలను పొందడానికి మాత్రమే వీరు పరిమితయ్యారు. కొబ్బరి పార్కు ఏర్పాటు విషయంలో మాత్రం ప్రభుత్వాలు ముందుకు సాగడం లేదు. కొబ్బరి అనుబంధ ఉత్పత్తులు తయారు చేయగలిగితే ఉద్దానం కొబ్బరికి పూర్వ వైభవం వస్తుంది. కూటమి ప్రభుత్వం కొబ్బరి పంట సాగుకు తోడ్పాటు అందించడంతోపాటు మార్కెట్‌లో కొబ్బరికి మద్దతు ధర ప్రకటించి, అమలయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నష్టపరిహారం అందలేదు..



ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో ఉద్దానం కొబ్బరికి చాలా నష్టం జరిగింది. 1999లో వచ్చిన సూపర్ సైక్లోన్‌తో పాటు హుద్‌హుద్, ఫైలాన్, తితలీ తుఫాన్లతో కొబ్బరి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. బీమా చేసుకున్నా పంట నష్టపరిహారం అందడం లేదు. కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకునేలా శాశ్వత పరిష్కారం చూపాలి.

-తమరాల శోభన్, కొబ్బరి రైతు, మఖరాంపురం

అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం..



ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి పంట అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అలాగే కొబ్బరి కార్మికుల కుటుంబాలకు సైతం ఉపాధి కల్పించే విధంగా కొబ్బరి అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. కొబ్బరికి మద్దతు ధర కల్పిస్తాం. ఉపాధి పథకం ద్వారా కొబ్బరి పంట అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం.

-బెందాళం అశోక్, శాసనసభ్యుడు, ఇచ్ఛాపురం

హెచ్‌సీ ఇంట్లో దొంగతనం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండిగోవిందపురంలో గల హెచ్‌సీ పేడాడ విజయకుమార్ ఇంట్లో తులం బంగారం దొంగిలించినట్లు ఎస్ఐ సీహెచ్ రామారావు చెప్పారు. ఎస్ఐ కథనం మేరకు.. పేడాడ విజయకుమార్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌గా కాకినాడలో ఉద్యోగం చేస్తూ కుటుంబ సభ్యులతో అక్కడే ఉంటున్నారు. పూండిలో ఉన్న ఇంటికి అప్పుడప్పుడు వస్తుంటారు. గతనెల 20న వచ్చివెళ్లారు.శుక్రవారం రాత్రి దొంగలు తులం బంగారం దొంగిలించినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదుచేశారు.ఈ మేరకు ఆదివారం సంఘటన స్థలాన్ని ఎస్ఐ పరిశీలించి కేసునమోదు చేశారు. నివాసముండని వారు విలువైన వస్తువులు ఇళ్లలో ఉంచరాదని ఎస్ఐ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎచ్చెర్ల: మండలంలోని అరిణాం అక్కివలస జంక్షన్‌కు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి శ్రీకాకుళం నుంచి విశాఖ వెళ్తున్న వ్యాన్‌ను వెనుక నుంచి వస్తున్న కంటైనర్ ఢీకొంది. దీంతో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న తమిళనాడుకు చెందిన నీరజ్ పాశ్వన్, వికాస్ యాదవ్, నరేష్ శర్మలు గాయపడ్డారు.వీరిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎచ్చెర్ల హెడ్‌కానిస్టేబుల్ ప్రసాదరావు కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని చిన్నారికి...

టెక్కలి: పట్టణంలోని బన్నువాడ రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొని కంద్రవీధికి చెందిన ఐదేళ్ల సమీరకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు మీద నడిచి వెళ్తుండగా ద్విచక్రవాహనం ఢీకొనడంతో చిన్నారి తలకు గాయం కావడంతో స్థానికులు హుటాహుటిన జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

నరసన్నపేట:స్థానిక జమ్ము జంక్షన్ వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.గోపాలపెంట నుంచి టెక్కలివైపు అనుమతిలేకుండా ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మద్యం దుకాణాల సిబ్బంది నిరసన

అరసవల్లి: ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలు ప్రైవేటుకు అప్పగించాలని నిర్ణయించడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న 15వేల మంది రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తంచేశారు.ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో పని చేస్తున్న సిబ్బంది నిరసన తెలిపారు. కార్యక్రమంలో ధర్మారావు, శ్రీనివాసరావు, సంతోష్, బుచ్చిబాబు పాల్గొన్నారు.

వలసల నివారణపై ప్రత్యేక దృష్టి: కమిషనర్

కలెక్టరేట్: వలసల నివారణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని మత్స్యశాఖ కమిషనర్ డోల శంకర్ తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు చేపడతామని చెప్పారు.ఈ మేరకు మత్స్యశాఖ సిబ్బందితో ప్రత్యేక సమీక్షించారు. ఆదివారం పెద్ద గనగళ్లవానిపేట సముద్రతీర ప్రాంతాల్లో పర్యటించారు. మత్స్యకారులసమస్యలు, వలసల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన పద్ధతుల్లో ఆక్వాకల్చర్ చేసి, అధిక లాభాలు పొందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీడీ ఫిషరీస్ పి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ సత్యానారాయణ, సర్పంచ్ రామారావు,ఎంపీటీసీ ఏమోజీరావు, కె.గంగాధరరావు, పాల్గొన్నారు.

రచనలు సమాజాన్ని జాగృతం చేయాలి

శ్రీకాకుళం కల్చరల్: రచనలు సమాజాన్ని జాగృతం చేసే విధంగా ఉండాలని తెలుగు రచయితల వేదిక అధ్యక్ష కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్‌వీ రమణమూర్తి తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలో తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 96వనెల నెలావారీ సాహితీ సమ్మేళనం నిర్వహించారు.కార్యక్రమంలో కవులు ప్రసాద్, గోపాలరావు, తంగి ఎర్రమ్మ, యు.నాగేశ్వరరావు, అప్పలరాజు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఇచ్ఛాపురం: ఈదుపురం వద్ద బాహుదానది ఒడ్డున మృతి చెందిన అనాథ (పింటు)శవానికి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెచ్‌సీ తెలుకుల రామారావు అంత్యక్రియలు నిర్వహించారు. శనివారం రాత్రి మృతి చెందిన పింటు శవాన్ని పోస్ట్‌మార్టం కోసం పోలీసులు ఇచ్ఛాపురం సీహెచ్‌సీకి తరలించారు. మృతుడికి కుటుంబసభ్యులు ఎవరూ రాకపోవడంతో హెచ్‌సీ రామారావు ఆదివారం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

అరసవల్లిలో మహాలింగార్చన

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకుల మహాలింగార్చన నిర్వహించారు.కార్యక్రమంలో జూనియర్‌అసిస్టెంట్ బీఎస్‌చక్రవర్తి, ఇప్పిలి సాందీపశర్మ, శ్రీనివాసశర్మ పాల్గొన్నారు. కాగా ఆదివారం స్వామివారికి రూ. 1,92,533ల ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.35,300లు, విరాళాల ద్వారా రూ.42,773లు, ప్రసాదాల రూపంలో రూ.1,14,460ల ఆదాయం లభించినట్లు ఈవోడీఎల్‌వీ రమేష్‌బాబు తెలిపారు.కాగాఅరసవల్లి సూర్యనారాయణ ఆలయంలో కృష్ణాష్టమి ఉత్సవాల్లో భాగంగా ప్రధానఅర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు అనివెట్టి మండపంలో పూజలు నిర్వహించారు.

ఆరో తేదీ వరకూ ధరల పెరుగుదలపై నిరసన

అరసవల్లి: నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు ఈనెల ఆరోతేదీ వరకూ దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ప్రచార, నిరసన కార్యక్రమాలను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలోని ఎన్ఆర్ క్రాంతి భవన్‌లో నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు మొజ్జాడ యుగంధర్, కొన్న శ్రీనివాసరావు, నాయకులు వసంతరావు, రాజేష్ పాల్గొన్నారు.

శిలంబం పోటీల్లో సత్తాచాటిన శ్రీకాకుళం జట్టు

శ్రీకాకుళం స్పోర్ట్స్:శ్రీకాకుళంలోని ఆదివారంపేటలో జరిగిన ఏపీ స్టేట్ లెవెల్ శిలంబం చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం జట్టు సత్తాచాటింది. ఈమేరకు కృష్ణా జిల్లా విజయవాడకు చెందిన విద్యార్థులు 469 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవశం చేసుకున్నారు. శ్రీకాకుళం 318 పాయింట్లతో ద్వితీయ స్థానం, ఏలూరు 205 పాయింట్లతో తృతీయస్థానం సాధించింది. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఏజ్ గ్రూపులకు చెందిన 125 మంది క్రీడాకారులు పాల్గొనగా, కర్రసాము సింగిల్ స్టిక్, డబుల్ స్టిక్, కత్తిసాము, ప్రొటెక్షన్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. 300పైగా పతకాలను క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శిలంబం సంఘం అధ్యక్షుడు, టెక్నికల్ డైరెక్టర్ బలగ శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి బలగ హర్షవర్ధన్, రాష్ట్ర కార్యదర్శి కె.సత్య శ్రీకాంత్, మీనా సరస్వతి,టీడీపీ అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తినాయుడు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో...

రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. అనకాపల్లిలో జరుగుతున్న 11వ రాష్ట్ర స్థాయి పోటీల్లో మహిళలు 55 కేటగిరిలో జూనియర్, సీనియర్ విభాగాల్లో డి.యామశ్రీ సిల్వర్ మెడల్, గోల్డ్ మెడల్, సీనియర్ 64 కేజీల విభాగంలో సీని యర్, జూనియర్ విభాగాల్లో జి.వర్షిత మూడు బంగారు పతకాలతోపాటు బెస్ట్ లిఫ్టర్ అవార్డు సొంతం చేసుకుంది. సీనియర్ కేటగిరిలో జి.లలితకు మూడో స్థానం, బాలుర విభాగంలో తరుణ్ సబ్‌జూనియర్‌లో బంగారం, జూనియర్ విభాగంలో మూడో స్థానంతో స్ట్రాంగ్ మాన్ అవార్డు సొంతం చేసుకున్నారు. జి.సునీల్‌కు బంగారం పతకాన్ని సాధించారు.

శ్లాబ్ కారి..మందులు తడిచి

ఇచ్ఛాపురం:కొళిగాం పీహెచ్‌సీలో కారిపోతుండడంతో మందులు తడిచిపోతున్నాయి. పీహెచ్‌సీ శ్లాబ్‌లో ఓ భాగం దెబ్బతినడంతో చిన్నపాటి వర్షం కురిస్తే కారిపోతోంది. దీంతో కేంద్రంలో మందులు తడిచి ముద్దవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. దీంతో సిబ్బంది వర్షంకురిస్తే బకెట్లు ఏర్పాట్లుచేస్తున్నారు. వర్షం కురిస్తే అవస్థలు తప్పడం లేదని వారు వాపోతున్నారు. తక్షణమే శ్లాబ్‌కు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.



నీరుకారుతున్న చోట బకెట్లు పెట్టిన దృశ్యం

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



తుఫాన్ షెల్టర్ వద్ద మత్స్యకారులతో మాట్లాడుతున్న కలెక్టర్

రణస్థలం:బంగాళఖాతంలో అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. ఆదివారం పోతయ్యపేటలో తుఫాన్ షెల్టర్‌ను పరిశీలించారు. ఎత్తైన ప్రదేశాల్లో పడవలు, వలలు భద్రపరుచుకోవాలని, చేపలవేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచించారు. మత్స్యకారులకు చేసిన ఏర్పాట్లను ఎస్‌డీసీ ఎస్‌వీ లక్ష్మణమూర్తి, తహసీల్దార్ ఎన్.ప్రసాద్ వివరించారు. సాగర తీరం యొక్క దృశ్యాలన డ్రోన్ కెమెరా ద్వారా వీక్షించారు. ఆయనతో పాటు ఎంపీడీవో వెంకటరమన, ఈవోఆర్‌డీ ధనుంజయరావు ఉన్నారు.

చేపలవేటకు వెళ్లవద్దు

బోట్లు, వలలు సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలని, సముద్రం అల్లకల్లోలంగా ఉందని, చేపల వేటకు వెళ్లకండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. ఆదివారం అల్లివలస, కొవ్వాడ తదితర మత్స్యకార గ్రామాల్లో పర్యటించారు. ఆయనతో పాటు లంక శ్యామలరావు, దుమ్మ అశోక్, పిషని జగన్నాదంనాయుడు, లంక ప్రభ, గొర్లె సాయిబాబు, మైలపల్లి పోలీస్ ఉన్నారు.

వినాయక మండపాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు

కవిటి:వినాయక ఉత్సవాల మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలని ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నంనాయుడు కోరారు. ఆదివారం కవిటి పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన పోర్టల్‌లో దరఖాస్తును ఆన్‌లైన్‌లో పొందుపరిచిన తర్వాత పరిశీలించి అనుమతులు ఇవ్వనున్నామని తెలిపారు.మద్యం అక్రమ రవాణా,ఇసుక అమ్మకాలుపై దృష్టి సారించామని చెప్పారు. కాగా టీడీపీ నాయకులు సీఐ చిన్నంనాయుడును కలిసి అభినందించారు.

●**కంచిలి:** వినాయక నవరాత్రి పూజలు నిర్వహణకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సోంపేట సీఐ బి.మంగరాజు తెలిపారు. బూరగాంలో వినాయక మండపాలు ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో కంచిలి ఎస్ఐ జి.రాజేష్, టీడీపీ నాయకులు బొడ్డు అప్పారావు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

●తహసీల్దార్‌కార్యాలయాల వద్ద ఏపీటీఎఫ్ నిరసనలు

(గుజరాతీపేట/పొందూరు/ సోంపేట/ కవిటి/ ఇచ్ఛాపురం)

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు.ఈమేరకు పొందూరు, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఆదివారం శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు.అనంతరం డీటీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శులు, శ్రీకాకుళం, గార, ఎచ్చెర్ల మండలాల శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు హామీ నెలబెట్టుకోవాలి

గుజరాతీపేట:సీపీఎస్ రద్దుచేయడంపై ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాసపట్నాయక్ కోరారు. ఆదివారం శ్రీకాకుళంలోని కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి, ఏపీసీపీఎస్‌యూ ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.భాస్కరరావు, ఎస్టీయూ నాయకులు జి.రమణ, పి.రామకృష్ణ, చింతాడ సూర్యారావు, చింతల రామారావు, బి.శ్రీధర్, బి.సత్యం, కె.శ్రీనివాసరావు, తేజ పాల్గొన్నారు.

బీటీఏ ఆధర్యంలో

శ్రీకాకుళంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో సీపీఎస్ రద్దుచేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు.అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు ఎస్.రమేష్ బాబు, పి.ప్రతాప్‌కుమార్, బి.షన్ముఖరావు, జి.పోలీసు పాల్గొన్నారు.



గుజరాతీపేట: కలెక్టరేట్ వద్ద ఎస్టీయూ నాయకుల నిరనస

యుద్ధాన్ని వ్యతిరేకించాలి

అరసవల్లి: అమెరికన్ సామ్రాజ్యవాదంతో పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడిని, ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధాన్ని వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు కోరారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో యుద్ధాలు వద్దు - శాంతి ముద్దు అన్న నినాదంతోశాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వీజీకే మూర్తి, ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య, అల్లు మహాలక్ష్మి, ఎస్‌వీ రమణ, ఆర్.ప్రకాష్ పాల్గొన్నారు.

'వర్షాలతో పంటలకు తెగుళ్లు'

అరసవల్లి: అధిక వర్షాల వల్ల పంటలు వివిధ రకాల తెగుళ్లకు గురవుతాయని ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త పి.ఉదయబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.వాటి వల్ల కలిగే నష్టం నుంచి బయటపడాలంటే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు వరి, మొక్కజొన్న, ప్రత్తి, కంది, చెరకు పంటలకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ప్రతి ఇంటి ముందు మొక్క నాటాలి

ఇచ్ఛాపురం: ప్రతి ఇంటి ముందు మొక్కను నాటాలని టీడీపీ వార్డు ఇన్‌చార్జి రంగాల శ్రీను కోరారు. ఆదివారం ఇచ్ఛాపురంలోని సయ్యద్‌ఖాన్ చెరువు చుట్టూ స్వేచ్ఛావతి ప్రవేట్ ఎలక్ట్రిషియన్ యూనియన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

అపుస్మా అధ్యక్షుడిగా లక్ష్మణరావు

అరసవల్లి: శ్రీకాకుళంలోని శ్రీసాయి విద్యా సంస్థల అధినేత బూరగాపు లక్ష్మణరావు ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా (అపుస్మా) ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఓ హోటల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో కార్యదర్శిగా సన్ స్కూల్ డైరెక్టర్ సిల్లా మోహనరావు, కోశాధికారిగా ఇన్‌స్పైర్ స్కూల్ డైరెక్టర్ అన్నెపు అనంతరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వహణాధికారి డాక్టర్ ఖాసిం, పరిశీలకులు రాష్ట్ర కోశాధికారి ఎంవీ రావు, విశాఖ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జోనల్ ఇన్‌చార్జి మధు, పలువురు పెద్దలు, కరస్పాండెంట్లు సమక్షంలో ఎన్నిక జరిగింది. ఈమేరకు ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి అభినందించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, సవాళ్లను ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



నూతనంగా ఎన్నికైన ప్రైవేటు పాఠశాలల సంఘ కార్యవర్గం

రోడ్లపై నీరు.. వీధులు బురదమయం

●ఇదీ వర్షాలతో రాకపోకలకు ప్రజల అవస్థలు

జిల్లాలో తుఫాన్ ప్రభావంతో రెండురోజులుగా కురుసున్న వర్షాలకు రోడ్లపై నీరు చేరడంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల మట్టిరోడ్లు బురదమయమయ్యాయి. జనావాసాల్లోకి మురుగునీరుచేరుతోంది.



గార: బురదమయమైన ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ప్రాంగణం



ఇచ్ఛాపురం: కీర్తిపురంలో రోడ్డుపైకి చేరిన మురుగు నీరు

నేటి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

ఆమదాలవలస: నాయకులు సోమవారం ప్రారంభం కానున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమదాలవలస బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు కోరారు. ఆదివారం ఆమదాలవలసలో నియోజకవర్గ బీజేపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాతిన గడ్డెయ్య, బొడ్డేపల్లి చిన్నబాబు, గురువుబెల్లి వెంకటరావు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలి

పొందూరు:పెట్రోల్‌బంకులు, దాబాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ వి. తస్యనారాయణ సూచించారు. ఆదివారం పెట్రోల్‌బంకులు, దాబాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.

సామాజిక భవనం నిర్మించాలి

ఇచ్ఛాపురం: సామాజిక భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కౌన్సిలర్ ఆశి లీలారాణి కోరారు. ఆదివారం రామయ్యపుట్టుగలో మునిసిపాలిటీలోని 11వవార్డులో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. వార్డు పరిధిలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

సోంపేట : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ ఫార్మేషన్ దినోత్సవం పురస్కరించుకుని యూనియన్ కార్యదర్శి పి.ధనుంజయ ఆధ్వర్యంలో ఆదివారం సోంపేటలో బ్యాంక్ సిబ్బంది కుటుంబసభ్యులకు క్విజ్,ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ముప్పన ఈశ్వరరావు, డి.జోగారావు, కనకరాజు, సుష్మా, మనోజ్‌కుమార్, ఉష, వెంకటేష్ పాల్గొన్నారు.

కంచమ్మతల్లి కార్యవర్గం ఎన్నిక

కంచిలి: కంచిలికంచమ్మతల్లి ఆలయ కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఆలయ ప్రాంగణలో జరిగింది. కమిటీ గౌరవాధ్యక్షులుగా గుమ్మడిరామదాస్, మురళీ పట్నాయక్, ఛైర్మన్‌గా వంకల సోమేష్, ఉపాధ్యక్షుడిగా క్రాంతికుమార్, సెక్రటరీగా గుడియా శ్రీను, కోశాధికారిగా ఊణా శ్రీకాంత్‌లు ఎన్నికయ్యారు.

యంగ్‌స్టార్స్ కార్యవర్గం..

పొందూరు:పొందూరులోని యంగ్‌స్టార్స్ స్వచ్ఛందసంస్థ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బాసా ఆనంద్ మోహన్, అధ్యక్షుడిగా కె.శాంతారాం, ప్రధానకార్యదర్శిగా ఎ.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా పి.సూర్యప్రకాశరావు, సహాయకార్యాదర్శిగా బి. శివకుమార్, కోశాధికారిగా కె.విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్య క్రమంలో గుడ్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వెలగాడలో వైద్యపరీక్షలు

జి.సిగడాం:వెలగాడలో ఇటీవల డయేరియా ప్రబలడంతో ఆదివారం వైద్యాధికారులు బి.అనూష, ప్రతిష్టా శర్మలు ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. రాజాం, శ్రీకాకుళం ప్రభుత్వాసుపత్రి, శ్రీకాకుళం ప్రైవేటు ఆసుపత్రిలో ఐదుగురు చొప్పున చికిత్స పొందుతున్నారని,మరో 14 మందికి విలేజ్‌హెల్త్ క్లినిక్‌లో వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మరో ఆరుగురు ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి అయినట్లు చెప్పారు.

పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు

పొందూరు: లోలుగులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినం పురస్కరించుకుని ఆదివారం 50 మంది జనసేన కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, పేడాడ రామ్మోహన్, కొంచాడ చిన్నంనాయుడు పాల్గొన్నారు.●**ఇచ్ఛాపురం:** ధర్మపురానికి చెందిన జనసేన నాయకులు అన్నదానం చేశారు. ఈ మేరకు తులసమ్మతల్లి ఆలయం వద్ద ఆహార పొట్లాలు అందించారు. ధర్మపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జారుడు బల్లను అందజేశారు.